



# బోనాల వేళ పేదింట వెలుగు!

- ఉప్పరిపల్లిలో 'ఇందిరమ్మ' ఇళ్ల సంబురం
- లింగమంతుల స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే బాలు నాయక్

**చింతపల్లి, సెప్టెంబర్ 3 (నేటి దర్శిని) :** బోనాల పండుగ వేళ చింతపల్లి మండలం ఉప్పరిపల్లిలో పేద కుటుంబాల ఇళ్లలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిర్మించిన నూతన గృహాల్లో గృహప్రవేశాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఉప్పరిపల్లిలోని లింగమంతుల స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవరకొండ నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించిన నూతన ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. వడ్లకొండ శంకర్--నిర్మల, బండ్ల వెంకటయ్య--లక్ష్మమ్మ కుటుంబాల నూతన గృహప్రవేశాల్లో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. పేదల సొంతింటి కలే లక్ష్యం ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ, ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్లతో నిరుపేదల జీవితాల్లో కొత్త వెలుగులు నిండుతున్నాయని, బోనాల పండుగ రోజునే సొంతింట్లో గృహప్రవేశం చేయడం ఎంతో సంతోషంగా ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జటావత్ హరి నాయక్, మాజీ ఎంపీపీ కొండూరు పవన్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుకల వెంకటయ్య గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, సర్పంచ్ మెండే వెంకట్ యాదవ్, ఉప సర్పంచ్ బాలాగోని అలివేలు--దేవయ్య, మాజీ ఎంపీటీసీ గుణమోని కొండల్ యాదవ్, చందంపేట మండల అధ్యక్షుడు దొండేటి మల్లారెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కిన్నెర హరికృష్ణతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సన్నరకాల సాగుపై
# రైతులకు అవగాహన!

- చింతపల్లి రైతు వేదికలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ జీవ ఎరువులు, కషాయాల తయారీపై
- శాస్త్రవేత్త రాములమ్మ అవగాహన





**చింతపల్లి, సెప్టెంబర్ 3 ( నేటి దర్శిని) :** చింతపల్లి మండల కేంద్రంలో రైతులు అధిక దిగుబడులు సాధించడంతో పాటు భూసారం కాపాడుకునేలా ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పించేందుకు చింతపల్లి రైతు వేదికలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వరి సన్నరకాలు, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి కేవీకే కంపాసాగర్ శాస్త్రవేత్త రాములమ్మ ముఖ్య అతిథిగా హాజరై రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వివిధ రకాల సన్న వరి వంగడాల ఎంపిక, వాటి ప్రాధాన్యతతో పాటు ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత, ప్రయోజనాలు వివరించారు. జీవ ఎరువులు.. కషాయాల తయారీపై ప్రత్యేక శిక్షణ ప్రకృతి వ్యవసాయంలో వినియోగించే జీవ ఎరువులు, వివిధ కషాయాలను ఇంటి వద్దనే తయారు చేసుకునే విధానం గురించి శాస్త్రవేత్త రాములమ్మ రైతులకు వివరించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తూ ప్రకృతి ఆధారిత సాగు పద్ధతులను అవలంబించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో మండలంలోని వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు. రైతులకు సాగులో ఎదురయ్యే సమస్యలపై అధికారులు సూచనలు అందించారు.

# రోడ్డు భద్రతకు దాతృత్వ హస్తం!





- పోలీసులకు 40 బారికేడ్లు
- అందజేసిన వెళ్ళంకి శంకర్‌రావు
- ప్రమాదాల నివారణకు ప్రజలూ బాధ్యతగా వ్యవహరించాలి ఎమ్మెల్యే బాలు నాయక్

**చింతపల్లి, సెప్టెంబర్ 3 (నేటి దర్శిని) :** రోడ్డు ప్రమాదాల నివారణకు వెళ్ళంకి ఫుడ్స్ అధినేత వెళ్ళంకి శంకర్‌రావు భారీగా ముందడుగు వేశారు. తన సొంత ఆర్థిక సహకారంతో 40 రోడ్డు భద్రత బారికేడ్లను తయారు చేయించి దేవరకొండ పోలీస్ శాఖకు అందజేశారు. గురువారం తీదేడు గేటు సమీపంలోని వెళ్ళంకి ఫుడ్స్ వ్యవసాయ క్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ సమక్షంలో బారికేడ్లను పోలీసులకు అందించారు. ప్రమాదకర ప్రాంతాల్లో బారికేడ్లతో వేగ నియంత్రణహైదరాబాద్--నాగార్జునసాగర్ ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేయడం ద్వారా వాహనాల వేగాన్ని నియంత్రించి ప్రమాదాలను తగ్గించవచ్చని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాల రక్షణ కోసం ముందుకొచ్చిన వెళ్ళంకి శంకర్‌రావును అభినందించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకూ సహకారంరోడ్డు భద్రతతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన ప్రాంతాల్లో భవిష్యత్తులో సీసీ కెమెరాల ఏర్పాటుకు కూడా సహకరిస్తానని వెళ్ళంకి శంకర్‌రావు తెలిపారు. నేరాల నియంత్రణతో పాటు ప్రమాదాలు, అసాంఘిక కార్యకలాపాల గుర్తింపులో సీసీ కెమెరాలు కీలకమన్నారు. నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలకు అడ్డుకట్ట వాహనదారులు అతివేగానికి దూరంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎమ్మెల్యే సూచించారు. రాత్రివేళల్లో మరింత అప్రమత్తంగా ప్రయాణిస్తూ పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో దేవరకొండ, కొండమల్లేపల్లి పోలీసు అధికారులు, మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బంగారు
# మైసమ్మ బోనాలు





**మిడ్జిల్ ఆగస్టు 03, (నేటి దర్శని) :** మిడ్జిల్ మండలంలోని మసిగుండ్లపల్లి గ్రామంలో బంగారు మైసమ్మ బండ్ల బోనాల వేడుకలను గ్రామ సర్పంచ్ గోదా శ్రీశైలం, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోదా శ్రీశైలంతో పాటు భీమ్‌రాజు, వెంకటయ్య, శీను, ప్రదీప్‌రెడ్డి, శేఖర్, శ్రీశైలం, ఉమేష్, లాలయ్య, ఆంజనేయులు, యాదయ్య, లక్ష్మయ్య తదితర గ్రామ పెద్దలు, ప్రజలు పార్టీలకు అతీతంగా పాల్గొని బంగారు మైసమ్మ అమ్మవారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమం భక్తుల సందడితో ఉత్సాహంగా సాగింది.

# కాంగ్రెస్‌లో క్రమశిక్షణకు పెద్దపీట

- టీపీసీసీ క్రమశిక్షణ చర్యల కమిటీ చైర్మన్ డాక్టర్ మల్లు రవి



**ఆమనగల్లు, సెప్టెంబర్ 03(నేటి దర్శిని);** కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని టీపీసీసీ క్రమశిక్షణ చర్యల కమిటీ చైర్మన్, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి అన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కొండా సురేఖ, జి. చిన్నారెడ్డి వ్యవహారంపై కీలక వివరాలు వెల్లడించారు. కొండా సురేఖ, డాక్టర్ జి. చిన్నారెడ్డికి సంబంధించిన క్రమశిక్షణా అంశాలను కమిటీ పరిశీలించి, విచారణ అనంతరం వారిపై చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేస్తూ పార్టీ అధిష్టానానికి నివేదిక సమర్పించినట్లు మల్లు రవి తెలిపారు. పార్టీలో పదవి, స్థాయి, సీనియారిటీతో సంబంధం లేకుండా క్రమశిక్షణ అందరికీ సమానంగా వర్తిస్తుందని స్పష్టం చేశారు. క్రమశిక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. కమిటీ సిఫార్సుల ఆధారంగా పార్టీ అధిష్టానం, రాష్ట్ర ప్రభుత్వం తదుపరి చర్యలు చేపట్టాయని తెలిపారు. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించాలని నిర్ణయించి, గవర్నర్‌కు అధికారిక సిఫార్సు పంపినట్లు వెల్లడించారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా డాక్టర్ జి. చిన్నారెడ్డి నియామకాన్ని రద్దు చేసినట్లు తెలిపారు. మరోవైపు పాలన, ప్రజా పరిపాలనలో మహిళలకు మరింత ప్రాధాన్యత కల్పించే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని మల్లు రవి వివరించారు. గద్వాల్ విజయలక్ష్మిని క్యాబినెట్ మంత్రి హోదాతో తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షురాలిగా, నెరెళ్ల శారదను తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా, జి. సుధారాణిని వరంగల్ కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్‌గా నియమించినట్లు తెలిపారు. ఈ నియామకాలకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు సెప్టెంబర్ 3న జారీ అయ్యాయని చెప్పారు. సుధారాణి కుడా చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి రెండేళ్లపాటు పదవిలో కొనసాగుతారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి క్రమశిక్షణ, పార్టీ విధానాల పట్ల నిబద్ధత ఎంతో అవసరమని మల్లు రవి అన్నారు. ఎంతటి సీనియర్ నాయకుడైనా, ఏ పదవిలో ఉన్నా పార్టీ క్రమశిక్షణ విషయంలో ఒకే నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేశారు. అదే సమయంలో కీలక నిర్ణయాధికార పదవుల్లో మహిళలకు మరింత ప్రాతినిధ్యం కల్పించడాన్ని స్వాగతించారు. క్రమశిక్షణకు కట్టుబాటు, మహిళలకు సముచిత ప్రాతినిధ్యం, ప్రజా పాలనకు ప్రాధాన్యత అనే లక్ష్యాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

# నవోదయ పాఠశాలలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

- రాధా-కృష్ణుల వేషధారణలో అలరించిన విద్యార్థులు
- ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల కరస్పాండెంట్ అనంతుల జంగయ్య



**చింతపల్లి, సెప్టెంబర్ 3 (నేటి దర్శిని) :** చింతపల్లి మండలం కుర్మేడు గేటు సమీపంలోని నవోదయ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పాఠశాల కరస్పాండెంట్ అనంతుల జంగయ్య గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు రాధా-కృష్ణుల, గోపికల వేషధారణలలో చేసిన నృత్యాలు, భక్తి గీతాల ఆలాపనలు, సాంస్కృతిక ప్రదర్శనలు వీక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం ముఖ్య అతిథి అనంతుల జంగయ్య గౌడ్ మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడి జీవితం ధర్మం, కర్తవ్యనిష్ఠ, మరియు నిజాయితీకి నిలువెత్తు రూపమని కొనియాడారు. నేటి తరం విద్యార్థుల్లో భారతీయ సంస్కృతిని, నైతిక విలువలను పెంపొందించేందుకు విద్యాసంస్థల్లో ఇలాంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వేడుకల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు మరియు పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొన్నారు.

